క్లుప్తంగా

తెల్ల రేషన్ కార్డుల కోసం వినతి



భాస్కరరావుతో మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగులు

అగనంపూడి : విశాఖ ఉక్కు విశ్రాంత ఉద్యోగులకు తెల్ల రేషన్ కార్డులివ్వాలని అగనంపూడికి చెందిన కార్మిక సంఘాల నాయకులు కోరారు. విశాఖ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వి.భాస్కరరావును వీరంతా బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. నాలుగు దశాబ్దాలు సర్వీస్ చేసిన ఉక్కు ఉద్యోగులకు కేవలం ఈపీఎస్ పెన్షన్ నాలుగు వేలు మాత్రమే వస్తుందని, కుటుంబ పోషణ కష్టంగా ఉందని, తెల్ల రేషన్ కార్డు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని కోరారు. వేలాది మంది విశ్రాంత ఉద్యోగులకు న్యాయం చేయాలని నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, మరిశా రామచంద్రరావు, బలిరెడ్డి శ్రీను, బండారు చందు, పలకా అచ్చుత్ పాల్గొన్నారు.

రైతు బజార్లలో టమాటా విక్రయాలు



పెదగంట్యాడ రైతుబజారులో టమాటాల కోసం బారులు తీరిన వినియోగదారులు

పెదగంట్యాడ : రైతు బజారులో టమాటాల విక్రయాలను బుధవారం ప్రారంభించారు. బహిరంగ మార్కెట్‌లో కిలో టమాటా రూ.80 నుంచి రూ.100 వరకూ పలుకుతుండడంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి కిలో టమాటాను రూ.50కే విక్రయించేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా పెదగంట్యాడ రైతు బజారులో టమాటాల విక్రయాలను ప్రారంభించారు. వీటిని కొనుగోలు చేసేందుకు వినియోగదారులు బారులు తీరారు.

ఓపెన్ జిమ్, కమ్యూనిటీ హాల్ ప్రారంభం



ఓపెన్ జిమ్, కమ్యూనిటీ హాల్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

పెదగంట్యాడ : అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలో కొత్తగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్, కమ్యూనిటీ హాల్‌ను కార్పొరేటర్ పులి లక్ష్మీబాయితో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దొమ్మేటివీధిలోని మైదానంలో రూ.13.50 లక్షలతో ఓపెన్ జిమ్, చిన్నారుల కోసం ఆట వస్తువులు ఏర్పాటు చేశామని తెలిపారు. చిన కోరాడలో రూ.20 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రసాదుల శ్రీనివాస్, పులి వెంకటరమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల అందజేత



అనాథ బాలలతో గొందేశి సుధీర్‌రెడ్డి

పెదగంట్యాడ : అనాథ బాలలను ఆదుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎన్నారై గొందేశి సుధీర్‌రెడ్డి అన్నారు. స్థానిక సమతానగర్‌లో గల జనరేషన్ యువ చిల్డ్రన్స్ హోమ్‌లోని అనాథ బాలలకు మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరకులు బుధవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నెలా ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని తెలిపారు.

గ్రీన్ బెల్టులను మింగేస్తున్నారు..!

- ఇష్టారాజ్యంగా ఆక్రమించేసి వ్యాపారాలు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు



అక్కిరెడ్డిపాలెంలో సర్వీసు రోడ్డు పక్కన గ్రీన్ బెల్టులో ఆక్రమణలు



నాతయ్యపాలెంలో సర్వీసు రోడ్డు పక్కన కనిపించని గ్రీన్‌బెల్టు

అక్కిరెడ్డిపాలెం : పచ్చదనాన్ని పెంపొందించడం కోసం ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేసిన గ్రీన్ బెల్టులను కొందరు స్వార్థంతో ఆక్రమించేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రీన్ బెల్టు స్థలాల్లో వ్యాపార సముదాయాలు, గొడౌన్లు, కొందరైతే ఏకంగా నివాసాలు నిర్మించుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాల్సిన జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు కనీసం కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. జీవీఎంసీ 68, 69వ వార్డుల్లో గ్రీన్ బెల్టులు పూర్తిగా కనుమరుగైపోయాయి. రెండు వార్డుల్లో సర్వీసు రోడ్డు పక్కనున్న గ్రీన్ బెల్టులను పలువురు ఇష్టారాజ్యంగా ఆక్రమించేసి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు.

జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం నుంచి రాంనగర్ వరకు సర్వీసు రోడ్డు పక్కన గ్రీన్ బెల్టు ప్రస్తుతం కనిపించడం లేదు. సాయంత్రమైతే చిరు వ్యాపారులు ప్రభుత్వ స్థలంలో వ్యాపారాలు సాగిస్తూ దందా కొనసాగిస్తున్నారు. దీంతో అక్కిరెడ్డిపాలెం సర్వీసు రోడ్డులో వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ నిలిచిపోవడంతో పాదచారులు నరకయాతన అనుభవిస్తున్నారు.

ఆక్రమించేసి వ్యాపారాలు

అక్కిరెడ్డిపాలెం గ్రామంలో గ్రీన్‌బెల్టు స్థలం తమదే అంటూ సమీపంలోని నివాసులు ఆక్రమించేసి చిన్నచిన్న వ్యాపార సముదాయాలు నిర్మించి అద్దెలకు ఇచ్చేస్తున్నారు.

69వ వార్డు నాతయ్యపాలెంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. గ్రామంలోని రైల్వే ట్రాక్ నుంచి మార్బుల్ షాపులు, దాబాలు వంటి వాటితో సర్వీసు రోడ్డు పక్కనున్న గ్రీన్ బెల్టు ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దీంతో సర్వీసు రోడ్డు పూర్తిగా కుచించుకుపోయి పలుమార్లు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వీటిని నియంత్రించాల్సిన జీవీఎంసీ, సచివాలయం కార్యదర్శులు సైతం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. రోడ్ల



68వ వార్డు రాంనగర్‌లో సర్వీసు రోడ్డు పక్కన అక్రమ నిర్మాణాలు, వాహనాల పార్కింగ్

ఆక్రమణలు, గ్రీన్ బెల్టుల ఆక్రమణపై గ్రామంలో కొందరు కన్నెర్ర చేస్తూ త్వరలోనే జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఆక్రమణదారులకు సహకరిస్తున్న అధికారులపైనా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఫిర్యాదు చేయనున్నామని పలువురు తెలిపారు.

సాయంత్రమైతే రోడ్లపైనే పార్కింగ్

అక్కిరెడ్డిపాలెం సర్వీసు రోడ్డుపై సాయంత్రమైతే వాహనాల పార్కింగ్‌తో తీవ్ర ఇబ్బందిగా ఉంటుంది. గ్రీన్ బెల్టులను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న వారి వద్ద కొనుగోలు చేసేవారు, హోటళ్లకు వచ్చే వారు రోడ్డుపైనే వాహనాల పార్కింగ్ చేస్తుండటంతో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఎదుర్కొంటున్నాం. కనీసం ట్రాఫిక్ పోలీసులు స్పందించకపోవడం దారుణం. – అప్పారావు, అక్కిరెడ్డిపాలెం

సర్వీసు రోడ్డు కుచించుకుపోయింది

నాతయ్యపాలెం నుంచి షీలానగర్ వైపు వెళ్లే మార్గంలో సర్వీసు రోడ్డు పూర్తిగా కుచించుకుపోయింది. గ్రీన్‌బెల్టును పూర్తిగా ఆక్రమించిన వారు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. గ్రీన్ బెల్టు స్థలం కూడా తమదే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలి. – సన్యాసిరావు, నాతయ్యపాలెం

రేషన్ దుకాణాల్లో కందిపప్పు పంపిణీ

సాక్షి ఎఫెక్ట్..

పెదగంట్యాడ: రేషన్ దుకాణాల్లో కంది పప్పు పంపిణీ చేశారు. ఎన్నికల ముందు ధరలను అదుపు చేస్తామని, నిత్యావసర సరకులను రేషన్ డిపోల ద్వారా పంపిణీ చేస్తామని ప్రకటనలు గుప్పించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ ఊసే మరచిపోవడంతో పేద మధ్యతరగతి వారిపై భారం పెరిగిపోయింది. రేషన్ డిపోల్లో కందిపప్పునూ లబ్ధిదారులకు అరకొరగానే సరఫరా చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 8న సాక్షి దినపత్రికలో 'పండగ వేళ పప్పన్నమూ కష్టమే' శీర్షికతో వెలువడిన కథనంపై సివిల్ సప్లైస్ అధికారులు స్పందించారు. ఆర్ఐ పద్మావతి సమక్షంలో రేషన్ వాహనాల ద్వారా లబ్ధిదారులకు కందిపప్పును పంపిణీ చేశారు. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.



లబ్ధిదారులకు కందిపప్పు పంపిణీ చేస్తున్న దృశ్యం

సెయిల్‌లో విలీనం చేయాల్సిందే

అగనంపూడి : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని నిరసిస్తూ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో 1336వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించి సొంత గనులు కేటాయించాలని కోరారు. లేనిపక్షంలో సెయిల్‌లో విలీనం చేయాల్సిందేనన్నారు. సుమారు మూడున్నర సంవత్సరాల నుంచి ఉక్కు పరిరక్షణ కోసం వివిధ రకాల పోరాటాలు చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం ఆలోచించకుండా ముందుకెళ్తుండడం ఆంధ్రులను రెచ్చగొట్టడమే అవుతుందన్నారు. పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎస్.రామారావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పెద్దన్న పాత్ర పోషించి విశాఖ ఉక్కును కాపాడాలన్నారు. ఈ విషయంలో ద్వంద్వ వైఖరి అనుసరిస్తే తగిన మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు. రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన వారుగా మిగిలిపోతారన్నారు. కార్యక్రమంలో నాయకులు విళ్లా రామ్మోహన్‌కుమార్, వరసాల శ్రీనివాసరావు, సుబ్బయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్

ధ్యానంతో ఆత్మజ్ఞానం

పెదగంట్యాడ: ధ్యానం ద్వారానే ఆత్మజ్ఞానం సిద్ధిస్తుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త తటవర్తి రాజ్యలక్ష్మి అన్నారు. బ్రహ్మర్షి భగవాన్ పితామహ పత్రీజీ పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ ప్రతినిధి మీసాల శివ గణేశ్వరరావు ఆధ్వర్యంలో పెదగంట్యాడ సీడబ్ల్యూసీలో బుధవారం నిర్వహించిన ఆత్మజ్ఞాన శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని, సంపూర్ణ శాకాహారులుగా మారాలని కోరారు. దేవీ నవరాత్రుల్లో అమ్మవారి అవతారాల విశిష్టతను వివరించారు. ఆమెను ట్రస్ట్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రేవతి, దేవి, వనిత, పద్మావతి, భానుమతి, దేవిక తదితరులు పాల్గొన్నారు.



తటవర్తి రాజ్యలక్ష్మిని సత్కరిస్తున్న సభ్యులు

వీణా పుస్తక ధారిణి.. విద్యాప్రదాయిని

- సరస్వతీదేవిగా దుర్గామాత
- చిన్నారులకు అక్షరాభ్యాసాలు
- చదువుల తల్లికి విద్యార్థుల పూజలు

విద్యాప్రదాయిని సరస్వతీ దేవి. సకల కళలకు అధిదేవత అయిన అమ్మవారిని నియోజకవర్గవాసులు భక్తిశ్రద్ధలతో కొలిచారు. శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా దుర్గామాతను వీణా పుస్తకధారిణిగా అలంకరించి, విద్యార్థులు ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు.



పెన్నులు, పుస్తకాలతో సరస్వతీదేవి అలంకరణలో దుర్గాదేవి



తులసీదళాల అలంకరణలో దుర్గా దేవి



ఉక్కు త్రిశక్తి ఆలయంలో చిన్నారులతో అక్షరాభ్యాసాలు చేయిస్తున్న తల్లిదండ్రులు



ధాన్యలక్ష్మిగా శ్రీమహాలక్ష్మి



మహా సరస్వతీదేవి అవతారంలో శ్రీమహాదుర్గ



సరస్వతీ దేవి రూపంలో పెదమడక శ్రీమాతా దుర్గా భవానీ



కౌమారిగా శ్రీమహా సరస్వతి



అగనంపూడి దుర్గాలమ్మ ఆలయంలో సరస్వతీ దేవిగా ..

అక్కిరెడ్డిపాలెం: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూలా నక్షత్రం, సప్తమి తిథిని పురస్కరించుకుని దుర్గాదేవిని సరస్వతీ దేవిగా అలంకరించారు. ఎల్ఎన్ గార్డెన్స్‌లో ఎస్టీబీఎల్ అధినేత గుత్తికొండ బాలాజీ, అధ్యక్షుడు రమేష్, చైతన్యల సహకారంతో దుర్గా దేవిని సరస్వతీ దేవిగా పెన్నులు, పుస్తకాలతో అలంకరించారు.

- ఆటోనగర్‌లో దుర్గాదేవికి పారిశ్రామిక వేత్తలు విశేష పూజలు చేశారు. తొలిపూజలను సర్వసుద్ది సత్యబాబు, ప్రమీల, పాతర్లగడ్డ శ్రీనివాసరావు, సరిత దంపతులు నిర్వహించారు. పూజల్లో వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, కోశాధికారి పర్చూరి ప్రభాకర్, వై.సాంబశివరావు, రామభద్రరాజు తదితరులు పాల్గొన్నారు.
- తుంగ్లాంలో దుర్గాదేవిని తులసీదళాలతో అలంకరించారు.

ఆలయం వద్ద జరిగిన అన్న సమారాధనలో కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, పెట్ల అర్జున, పెట్ల శ్రీను, కాకి రామిరెడ్డి, గిడితూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: 76వ వార్డు బర్మాకాలనీలోని దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు సరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు.

- నడుపూరు నూకాంబిక ఆలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడ్డు కృష్ణారావు ఆధ్వర్యంలో ఉదయం సామూహిక కుంకుమార్చనలు. చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఆలయ అర్చకుడు రవి కుమార్ ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, ముప్పిడి శ్రీనివాసరావు, కోమల, ఈశ్వరరావు, సతీష్ దంపతులు పాల్గొన్నారు. అనంతరం నాట్యారాధన డ్యాన్స్ అండ్ మ్యూజిక్ స్కూల్ విద్యార్థులు కూచిపూడి నృత్యాలతో అలరించారు.

త్రిశక్తి దేవాలయంలో..

ఉక్కునగరం: స్థానిక త్రిశక్తి దేవాలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు పెద్ద ఎత్తున జరిగాయి. బుధవారం ఉదయం 6 గంటలకు రుత్వికుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో తమ పిల్లలతో పాల్గొన్నారు. సాయంత్రం పిల్లలచే సామూహిక సరస్వతీ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు సహస్ర శ్వేత కుసుమార్చన చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు ఫణిశర్మ నేతృత్వంలో సాయంత్రం మహిళలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

మహా సరస్వతిగా శ్రీమహాదుర్గ

త్రిశక్తి ఆలయంలో శ్రీమహాదుర్గ అమ్మవారు కనకాంబరం వర్ణం చీరలో మహాసరస్వతిదేవిగా దర్శనమిచ్చారు. శ్రీమహాలక్ష్మి అమ్మవారిని పసుపు వర్ణం చీరలో ధాన్యలక్ష్మి అవతారంలో, శ్రీమహాసరస్వతి అమ్మవారిని చందనం వర్ణం చీరలో కౌమారిగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు.

సరస్వతీదేవిగా దుర్గాలమ్మ

అగనంపూడి: 85వ వార్డు అగనంపూడిలోని దుర్గాలమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన మండపంలో దుర్గాదేవిని సరస్వతీ దేవి అవతారంలో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు, భవానీలు పాల్గొని అమ్మవారికి పూజలు, అభిషేకాలు, అర్చనలు చేయించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- పెదమడక నిర్వాసిత కాలనీలోని మాతా దుర్గా భవానీ అమ్మవార్ని సరస్వతీ దేవి అవతారంలో అలంకరింపజేశారు. అమ్మవారికి కుంకుమపూజలు చేసి, లలితా సహస్ర నామాలు పఠించారు. ఆలయ ధర్మకర్త బల్ల పైడిరాజు దంపతులు పూజలు చేశారు.

సోషల్ వెల్ఫేర్ కాలనీలో అన్న సమారాధన

గాజువాక : గణేష్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో 72వ వార్డు సీతారామనగర్ కాలనీ (సోషల్ వెల్ఫేర్ కాలనీ)లో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌ఛార్జి సిరట్ల శ్రీనివాస్ (వాసు) ప్రారంభించారు. యూత్ కమిటీ సభ్యులు మధు, నాగేంద్ర, గుణ, చందు, సాయిరామ్ పాల్గొన్నారు.



నడుపూరు నూకాంబిక ఆలయంలో యాగంలో పాల్గొన్న కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి



నడుపూరు నూకాంబిక ఆలయంలో చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన



బర్మా కాలనీ దుర్గాదేవి ఆలయంలో సరస్వతీ పూజలు



ఆటోనగర్ వాసీవా ఆధ్వర్యంలో దుర్గమ్మకు పూజలు చేస్తున్న పారిశ్రామికవేత్తలు



అన్నప్రసాదం వడ్డిస్తున్న సిరట్ల శ్రీనివాస్

ఒత్తిడితో మానసిక సమస్యలు

అక్కిరెడ్డిపాలెం: పని ఒత్తిడితో అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని షీలానగర్ కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్ డాక్టర్ భగవాన్ అన్నారు. అంతర్జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆస్పత్రిలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మానసిక ఆరోగ్య సమస్యలు ఎలా ఎదురవుతాయనే అంశంపై ఆయన మాట్లాడారు. జీవన శైలిలో మార్పులతో ఆరోగ్య సమస్యలతో పాటు మానసికంగానూ ఎంతోమంది ఇబ్బంది పడుతున్నారన్నారు. వాట్సప్, యూట్యూబ్, టీవీల్లో వస్తున్న వార్తలు, ఇతర వీడియోలను చూసి తమకు కూడా ఆ జబ్బు ఉందని ఆందోళనకు గురవుతున్నారన్నారు. జబ్బు లేకపోయినా జబ్బు ఉందనే భయంతో జీవితాలను వెళ్లదీస్తున్నారని తెలిపారు. పని, వ్యక్తిగత సమయం మధ్య సమతుల్యత కాపాడుకోవాలని సూచించారు. రోజూ చిన్నచిన్న విరామాలను తీసుకుంటూ పని సమయం పూర్తయిన వెంటనే పరికరాలు ఆపేసి విశ్రాంతి తీసుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



అవగాహన శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్లు

గాజువాక : హోమీ బాబా క్యాన్సర్ హాస్పిటల్ ప్రివెంటివ్ అంకాలజీ విభాగం వైద్యులు క్యాన్సర్‌పై బుధవారం అవగాహన శిబిరం నిర్వహించారు. గాజువాక జోనల్ కార్యాలయంలో నిర్వహించిన శిబిరంలో వైద్యులు మాట్లాడుతూ మారుతున్న జీవన శైలి వల్ల కూడా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. పొగాకు, మద్యం అలవాటు ఉన్న వారు వెంటనే మానుకోవాలని సూచించారు. క్యాన్సర్‌ను ముందుగా గుర్తించి సత్వర చికిత్స అందించడం వల్ల ప్రాణాలు కాపాడుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

సీతమ్మధార : ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశామని ద్వారకా స్టేషన్ పోలీసులు తెలిపారు. స్టేషన్ పరిధిలోని గురుద్వారా సమీపంలో పల్లవి అపార్ట్‌మెంట్ పైభాగంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ చేసి రూ.1.07 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ శ్రీను కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవారి సన్నిధిలో అన్నసమారాధనలు

అగనంపూడి: దేవీ నవరాత్రుల సందర్భంగా ఉత్సవాల నిర్వాహకులు పలు చోట్ల అన్నసమారాధనలు నిర్వహించారు. వడ్లపూడి నిర్వాసితకాలనీ మీ సేవా గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు, రమాదేవి దంపతులు ప్రారంభించారు. కార్యక్రమంలో అంగటి నూకరాజు, కాకి మధు, దుర్గా యూత్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

- కణితి నిర్వాసితకాలనీ మైదానంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, చిత్రాడ రమణ, ఆడారి శ్రీను, వెంకటరావు పాల్గొన్నారు.
- 87వ వార్డులో దుర్గాదేవి ఉత్సవాల్లో అన్నదానం జరిపించారు.



కణితిలో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ గాజువాక మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్

వైఎస్సార్‌సీపీ నాయకులు ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, చిగిలిపల్లి రవి, అక్కరాము రామారావు, బోండా గోవిందరాజులు, సబ్బవరపు ఈశ్వరరావు, దాసరి అప్పడు పాల్గొన్నారు.

- అగనంపూడి దుర్గాలమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.



వడ్లపూడి గ్రౌండ్స్‌లో అన్నసమారాధన ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు



అగనంపూడిలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు